7

సాక్షి
మహబూబాబాద్

బుధవారం । 22 । మార్చి । 2023



గంజాయి స్మగ్లర్ల అరెస్ట్
ఏపీ రాష్ట్రం నుంచి తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి.సీతారాం తెలిపారు. - 8లో▸



కార్యకర్తలకు అండగా ఉంటా..
పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
35.5^0/21.6^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉగాది శుభాకాంక్షలు

మహబూబాబాద్: జిల్లా ప్రజలకు కలెక్టర్ శశాంక మంగళవారం ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలన్నారు.

పల్లె ప్రకృతి వనం పరిశీలన



డోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం గ్రామంలోని పల్లెప్రకృతి వనాన్ని డిప్యూటీ సీఈఓ నర్మద మంగళవారం పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంతో పాటు నర్సరీ, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, చంటి పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, పంచాయతీ కార్యదర్శి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి



బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ శ్రేణులపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ బిందు సూచించారు. బయ్యారంలో కమ్మ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ శ్రేణులందరూ ఐక్యంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, రాంమూర్తిగౌడ్, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, బయ్యారం సర్పంచ్ కోటమ్మ, ఆత్మకమిటీ సభ్యులు ఐలయ్య, ఆర్‌ఎస్‌ఎస్ మండల కన్వీనర్ ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

గార్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరీక్షల విభాగం జిల్లా పరిశీలకుడు డాక్టర్ మధు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ పాల్పడిన విద్యార్థులను డీబార్ చేయాలని ఆదేశించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షకు 171 మంది విద్యార్థులకు గానూ 159 మంది హాజరు కాగా, 12 మంది పరైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రఘు తెలిపారు.

కృత్యమేళాలో మడగూడెం వాసికి ప్రథమ బహుమతి



గంగారం: జాతీయ గిరిజన కృత్య మేళాలో మండలంలోని మడగూడెం గ్రామానికి చెందిన చుంచ కుమార స్వామి ప్రథమ బహుమతి అందుకున్నాడు. ఈ నెల 13నుంచి 19వ తేదీ వరకు ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జాతీయ గిరిజన కృత్యమేళా నిర్వహించారు. ఈ మేళాలో తెలంగాణ నుంచి ఇద్దరు పాల్గొనగా.. కుమారస్వామి ప్రథమ బహుమతి పొందాడు. కాగా ఆయనను గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

ఆస్పత్రి తనిఖీ



దంతాలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో అందుతున్న వైద్యంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న సుఖప్రసవాలపై ఆరా తీశారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమం గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చైతన్య, స్పందన, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాజ్యపూజ్యమేనా..?

ఈ ఏడాదిలోనే అసెంబ్లీ ఎన్నికలు
- వెంటనే పార్లమెంట్ ఎలక్షన్స్
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న నాయకులు
- శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణంలో లెక్కలు



సాక్షి, మహబూబాబాద్: తెలుగింటి తొలి పండుగ ఉగాది రోజు ఏడాది పొడవునా చేపట్టే కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. వ్యవసాయం, వ్యాపారం, విద్య, ఉద్యోగంతో పాటు రాజకీయ నాయకులు తమ రాశిఫలాల ఆధారంగా అనుకూలతలు, వ్యతిరేకత, లాభనష్టాలు, ఆదాయవ్యయంతో పాటు రాజ్యపూజ్యం.. అవమానం గురించి తెలుసుకుంటారు. దీని ఆధారంగానే పనులు ప్రారంభిస్తారు. అయితే ఈ ఏడాది రాజకీయ నాయకులకు కీలకమని చెప్పుకోవచ్చు. ఈ సంవత్సరంలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వీలునుబట్టి పార్లమెంట్ ఎన్నికలు కూడా ఈ 'శోభకృత్'నామ సంవత్సరంలోనే జరిగితే జరగవచ్చు. కాగా రాజకీయ నాయకులు తమ అదృష్టాన్ని ఈ ఏడాదిలో పరీక్షించుకోనున్నారు. ఈ మేరకు నాయకులు ప్రత్యేకంగా తమకు రాజయోగం ఏ మేరకు ఉందని, అనుకూలంగా ఉంటే సరే.. లేకపోతే దోష నివారణకు మార్గాలను అన్వేషించుకుంటారు.

రాజ్యపూజ్యం స్థిరమేనా..?
జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలతోపాటు, జిల్లాలోని కొన్ని మండలాలతో కలిసి పాలకుర్తి, ములుగు, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఉన్నాయి. కాగా నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, హరిప్రియ ఉండగా.. ములుగు నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క కొనసాగుతున్నారు. అలాగే మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర పదవుల్లో ఉన్నారు. అయితే ఈ సంవత్సరంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మంత్రి దయాకర్‌రావుకు మినహా.. మిగతా వారికి టికెట్ వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఉంది. ఎంత మంది సిట్టింగ్‌లకు తిరిగి టికెట్ ఇస్తారు.. ఎంత మంది కొత్తవారు వస్తారు అనేది జిల్లాలో చర్చగా మారింది. అలాగే ఎంపీ, ఎమ్మెల్సీలుఅసెంబ్లీ ఎన్నికల బరిలో దిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో తమ రాజయోగాన్ని దక్కించుకునేందుకు పార్టీ టికెట్ తెచ్చుకుంటారో.. టికెట్ రాకపోతే.. వేరే పార్టీ తీర్థం పుచ్చుకొని పోటీలో నిలబడతారా అనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే. కాగా పోటీలో నిలిచేది ఎవరు.. అందులో గెలిచేది ఎవరు.. రాజ్యపూజ్యం ఎవరికి.. అవమానం ఎవరికి అనేది ఈ ఏడాది తేలనుంది. కాగా ఉగాది రోజు నిర్వహించే పంచాంగ శ్రవణ కార్యక్రమంలో వీరి భవితవ్యం కీలకం కానుంది. అధికార పార్టీలోనే కాకుండా ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా పంచాంగంలో తమ జాతక బలాలు ఎలా ఉంటాయని లెక్కలు వేసుకుంటున్నారు. ఆయా పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు పోటీ పడుతున్నారు.

నేడు 'ఉగాది పంచాంగ శ్రవణం'

- జిల్లాలో ముస్తాబైన ఆలయాలు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ఆలయాలు ఉగాది వేడుకలకు ముస్తాబయ్యాయి. బుధవారం సాయంత్రం దేవాలయాల్లో శోభకృత్ నామసంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నారు.అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. కాగా జిల్లా కేంద్రంలోని రామమందిరంలో సాయంత్రం 5.30 గంటలకు పంచాగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహిస్తామని శ్రీసీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ కమిటీ చైర్మన్ అనిల్‌గుప్త, సభ్యులు తెలిపారు. ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమానికి మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. బ్రహ్మశ్రీ గుడి రాధాకృష్ణమూర్తిచే పంచాంగ శ్రవణం జరుగుతుందని, భక్తులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కాగా ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణమహోత్సవం నిర్వహిస్తామన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు, రాములోరి ఊరేగింపు..
ఆలయంలో ఉగాది వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయ ప్రవేశద్వారం, మహారాజ గోపురం, ఆలయ ప్రాంగణం మొత్తాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటి రోజు వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం 9గంటలకు మంగళవాయిద్యాలతో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు. విఘ్నేశ్వరపూజ, అఖండ కలశ విగ్రహ ప్రతిష్ఠ, నీరాజనం, మంత్రపుష్పంతో పూజలు ప్రారంభం కానున్నాయి.



వేడుకలకు ముస్తాబైన రామాలయం



ఉగాది వేడుకల కోసం ఏర్పాట్లు

ప్రజల వద్దకు బీఆర్‌ఎస్ నేతలు!

ఆత్మీయ సమ్మేళనాలతో ముందుకు..
- కార్యకర్తలతో విస్తృత సమావేశాలు
- ఏప్రిల్ 24లోగా పూర్తయ్యేలా కార్యాచరణ..
- ఉమ్మడి వరంగల్ నేతలతో మంత్రి ఎర్రబెల్లి సమీక్ష



వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జ్ ప్రభాకర్‌తో కలిసి సమావేశమైన మంత్రి ఎర్రబెల్లి

సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా కార్యకర్తలను ప్రజల్లోకి పంపించేందుకు ఆ పార్టీ అధిష్టానం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో కార్యకర్తలందరినీ భాగస్వాములను చేయనున్నారు. ఆయాచోట్ల చేపట్టిన పనులు, అమలు చేసిన పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందుకోసం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పేరిట గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో, వార్డుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

నేతల భాగస్వామ్యం.. పథకాలపై ప్రచారం..
గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్, సింగిల్ విండో చైర్మన్‌లతోపాటు ఆయా జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్లు అందరితో ఈ సమావేశం నిర్వహించనున్నారు. సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉండే ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, ఇతర పదవులున్న నేతలందరినీ ఆహ్వానిస్తారు. పురపాలక సంఘాల్లో కౌన్సిలర్, పార్టీ వార్డు అధ్యక్షుడు ఇతర కార్యవర్గాన్ని భాగస్వామ్యం చేయనున్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు సమావేశాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. పది గ్రామాలను కలిపి ఒక ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. అదే పట్టణాల్లో 3 నుంచి 4 వార్డులను కలిపి ఓ సమ్మేళనం ఉంటుంది. ఆయా గ్రామాలనుంచి వచ్చే కార్యకర్తలకు అక్కడ చేపట్టిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరిస్తారు. పథకాలతో లబ్ధిపొందిన వారి జాబితాను అందిస్తారు.

ఏప్రిల్ 24 వరకు గడువు..
ఏ గ్రామ కార్యకర్తల సమ్మేళనం ఏ తేదీన నిర్వహిస్తారో నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్ణయించాల్సి ఉంటుంది. వివరాలను పార్టీ జిల్లా ఇన్‌చార్జులకు అందజేస్తే అక్కడినుంచి వచ్చిన ఆదేశాలకనుగుణంగా సమావేశాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24లోగా ఈ సమ్మేళనాలు పూర్తిచేయాలి. అనంతరం 25న గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేసి పండగ వాతావరణం తలపించేలా కార్యక్రమం చేపట్టాలని సూచనలున్నాయి. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం పార్టీ జిల్లా ఇన్‌చార్జులు ఆయా జిల్లాలకు చేరుకొని నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ అనుబంధ విద్యార్థి విభాగానికి చెందిన విద్యార్థులను ఇందులో ఎక్కువ సంఖ్యలో చేర్పించనున్నారు.

సమ్మేళనాలు ఘనంగా నిర్వహించాలి : మంత్రి ఎర్రబెల్లి
ఉమ్మడి జిల్లాలో జరిగే ఆత్మీయ సమ్మేళనాల్లో సీఎం కేసీఆర్ సందేశం ప్రతి కార్యకర్తకు చేరాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల, మండలాల, నియోజకవర్గ స్థాయిల వారీగా నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాలు, వాటి ఏర్పాట్లపై ఉమ్మడి వరంగల్ ముఖ్య నేతలతో ఇన్‌చార్జ్ ఎంఎస్.ప్రభాకర్‌తో కలిసి మంత్రి దయాకర్‌రావు మంగళవారం హనుమకొండ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలో మోదీ ప్రభుత్వ హయాంలో పెరిగిన పెట్రోల్‌తోపాటు నిత్యావసర సరుకుల ధరలు, కేంద్ర ప్రభుత్వ విధానాల వైఫల్యాలు, దేశ ప్రజలతోపాటు, తెలంగాణ రాష్ట్రానికి చేసిన అన్యాయాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ దయాకర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మేయర్ సుధారాణి, వరంగల్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్, ఎమ్మెల్యేలు రాజయ్య, ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, సతీష్ కుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వాసుదేవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంటల నష్టంపై ప్రత్యేక సర్వే చేయిస్తాం

- కలెక్టర్ శశాంక

తొర్రూరు రూరల్: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలపై ప్రత్యేక సర్వే చేయిస్తామని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం తొర్రూరు మండలంలోని అరిపిరాల, దుబ్బతండా, భీముడి తండాల్లో మొక్కజొన్న, మామిడి తోటలను ఇతర శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అకాల వర్షాలు, గాలి, వడగండ్ల బీభత్సంతో దెబ్బతిన్న అన్ని రకాల పంటలపై ప్రత్యేక సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదిక పంపించి, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఆయా శాఖల అధికారులు ఛత్రునాయక్, సూర్యనారాయణ, రమేష్‌బాబు,నాగేంద్రబాబు,కుమార్ పాల్గొన్నారు.

నర్సింహులపేటలో..
నర్సింహులపేట: ఇటీవల కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను మంగళవారం కలెక్టర్ శశాంక పరిశీలించారు. మండలంలోని బొజ్జన్నపేట, బీమ్లాతండాలో వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటలను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంటల నష్టంపై సమగ్ర సర్వే చేయించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. డీఏఓ ఛత్రునాయక్, ఉద్యానశాఖ జిల్లా అధికారి సూర్యనారాయణ, ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, హెచ్ఓ రాకేష్, రైతులు పాల్గొన్నారు.



భీముడితండాలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

దంతాలపల్లిలో ..
దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ శివారు తేజ్యతండాలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను కలెక్టర్ శశాంక మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటల నష్టంపై సర్వే చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. తొర్రూరు ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ శివాని, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ కుమార్‌యాదవ్, సర్పంచ్ సుష్మాగౌడ్, రైతులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్

మహబూబాబాద్: ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు ప్రజలకు అందించి లక్ష్యాలు సాధించాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ బ్యాంకర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని ప్రభుత్వరంగ బ్యాంకుల అధికారులతో ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, సాధించిన లక్ష్యాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకుల మేనేజర్లు ప్రభుత్వ పథకాల రుణాలు అందజేసి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. మెప్మా గ్రూపులకు బ్యాంక్ లింకేజీ రుణాలు అందించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు కుటీర పరిశ్రమలు స్థాపించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులకు బ్యాంకులు సకాలంలో రుణాలు అందించాలని చెప్పారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి..
మహబూబాబాద్ అర్బన్: యువత చదువుతో పాటు పలు రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకొని ప్రయోజకులుగా మారాలని అదనపు కలెక్టర్ అభిలాష అభివన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జీ–20 ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవీందర్, నలంద విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖనిజం మాయం!

- బెరైటీస్ ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్న మైనింగ్ మాఫియా
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అటవీశాఖ అధికారులు

గార్ల: కొన్ని ప్రాంతాల్లోనే అరుదుగా లభించే బెరైటీస్ ఖనిజం దొంగల పాలవుతోంది. గార్ల మండలంలోని సేరిపురం, పోచారం పంచాయతీ పరిధిలోని గుట్టల్లో నిల్వ ఉంచిన ఖనిజాన్ని అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత నాలుగు నెలల్లో పలుమార్లు లారీలు, ట్రాక్టర్లలో తరలించారని, వారం రోజుల క్రితం కూడా అక్రమంగా రవాణా చేసినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ విషయంలో అటవీశాఖ అధికారులు స్పందించడం లేదని, మాఫియా ముఠాతో అధికారులు కుమ్మక్కై దందా నడిపిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గతంలో కార్యకలాపాలు..
మండలంలోని సేరిపురం, పోచారం పంచాయతీల్లో బెరైటీస్ గుట్టలను పలు కంపెనీలు ప్రభుత్వం నుంచి లీజ్‌కు తీసుకొని కార్యకలాపాలు చేపట్టాయి. కొన్నాళ్లు తవ్వకాలు చేపట్టి ఖనిజాన్ని తరలించాయి. అయితే గార్ల మండలం ఏజెన్సీ ప్రాంతమని, గిరిజనులకే లీజ్‌కు ఇవ్వాలని, మైనింగ్ ప్రాంతమంతా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని పలువురు గిరిజనులతో పాటు స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు ఇండియన్ ఫారెస్ట్ సర్వే టీం సర్వే చేసి మైనింగ్ ప్రాంతమంతా రిజర్వ్ ఫారెస్టులో ఉందని నివేదిక ఇచ్చింది. ఈమేరకు హైకోర్టు మైనింగ్ సంస్థల లీజ్‌లను రద్దు చేసింది. దీంతో గత పదేళ్ల నుంచి మైనింగ్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఆ సయమంలో తవ్వకాలు చేపట్టి వదిలేసిన బెరైటీస్ ఖనిజం రక్షణకు గానూ గుట్టల చుట్టూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం ఆ కందకాలను పూడ్చి ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నారు.

మార్కెట్‌లో డిమాండ్..
ప్రస్తుతం మార్కెట్‌లో బెరైటీస్ ఖనిజానికి డిమాండ్ ఉంది. లారీ బెరైటీస్ ఖనిజం అమ్మితే రూ.5లక్షల వరకు లాభం వస్తుందని గతంలో మైనింగ్ నడిపిన వ్యక్తులు తెలిపారు. దీంతో మైనింగ్ మాఫియా ఫారెస్టు అధికారులతో కుమ్మక్కై రాత్రి సమయంలో లారీలు, ట్రాక్టర్లలో ఖనిజాన్ని తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. గత నాలుగు నెలల నుంచి రాత్రి సమయంలో ఖనిజాన్ని ఇక్కడి నుంచి కారేపల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న మరో మైనింగ్‌కు తరలిస్తున్నారు. అక్కడి వేబిల్లులు పొంది బెరైటీస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు చేపట్టి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. కాగా రాత్రి సమయంలో ఖనిజాన్ని తరలిస్తుండగా అడ్డుకున్న గ్రామస్తులను సైతం మైనింగ్ మాఫియా గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అటవీ అధికారులు స్పందించి బెరైటీస్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ డీఆర్ఓ రమేష్‌ను సాక్షి వివరణ కోరగా.. 'వారంరోజుల క్రితం బెరైటీస్ ఖనిజాన్ని లారీల ద్వారా ఎత్తుకెళ్లిన మాట వాస్తవమే. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఈ ఖనిజాన్ని గతంలో మైనింగ్ నడిపిన వాళ్లే ఎత్తుకెళ్లినట్లు అనుమానం ఉంది. మైనింగ్ ప్రాంతంలో వాచ్‌టవర్‌ను ఏర్పాటు చేసి ఖనిజం అక్రమ రవాణా కాకుండా రాత్రి సమయాల్లో సైతం సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తామని' ఆయన తెలిపారు.



సేరిపురం పంచాయతీ పరిధి మైనింగ్ ప్రాంతంలో నిల్వ ఉన్న బెరైటీస్ ఖనిజం



ట్రెంచ్ గుంతలను పూడ్చి రహదారి చేసుకున్న మైనింగ్ మాఫియా

దివ్యాంగుల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: దివ్యాంగులు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అందే రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం ఖాసీం అన్నారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగులు ఏర్పాటు చేసుకున్న లూయిస్ బ్రెయిలీ కాలనీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న దివ్యాంగులకు ప్రభుత్వం, జిల్లా అధికారులు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ పీరయ్య, వినోద్ రెడ్డి, వెంకన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గొర్రెకుంటలో ప్రమోద్‌, కాజీపేటలో గుర్తుతెలియన వ్యక్తి మృతి చెందారు.

గీసుకొండ: గ్రేటర్‌ వరంగల్‌ నగరం గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని ఓ రైస్‌మిల్లు రేకులు కప్పడానికి పైకెక్కిన ఆపరేటర్‌ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం.. 15వ డివిజన్‌ గొర్రెకుంటకు చెందిన కామగోని ప్రమోద్‌ (32) అదే గ్రామంలోని జయ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు మిల్లు పైకప్పు రేకులు పగిలిపోయాయి. దీంతో మంగళవారం ఉదయం పాత వాటిని తొలగించి కొత్తవి వేస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి ఎంజీఎంలో చేర్పించిన కొద్ది సమయానికి మృతి చెందాడు. మృతుడి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేటలో గుర్తు తెలియని వ్యక్తి..



కాజీపేట: కాజీపేట పట్టణంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్‌ కథనం ప్రకారం.. కాజీపేట రైల్వే జంక్షన్‌ ప్రాంతంలో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నట్లుగా అందిన సమాచారం మేరకు రెండు రోజుల క్రితం ఎంజీఎంలో చేర్పించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచడం జరిగిందని, వివరాలు తెలిసిన వారు 87126-85122, 87126-85246, 87126-85008 నంబర్లకు ఫోన్‌ చేయాలని కోరారు.

కూతురిని కాలేజీకి పంపించేందుకు వెళ్తూ..

- కుమార్తె కళ్లముందే ప్రాణాలు విడిచిన తండ్రి
- కారును ఢీకొట్టిన లారీ
- రైతు మృతి, ఒకరికి గాయాలు



కారులో మృతి చెందిన శ్రీనివాసరావు



క్షతగాత్రురాలు శృతి



శ్రీనివాసరావు (ఫైల్‌)

ఏటూరునాగారం: కన్నబిడ్డను కాలేజీకి పంపుదామని బయలుదేరిన ఆ తండ్రిని విధి కబళించింది. కళ్లముందే తండ్రి ప్రాణాలు కోల్పోవడంతో కుమార్తె గుండెలవిసేలా రోదించింది. తనను సాగనంపడానికి వచ్చి కానరానిలోకాలకు పోతివా.. అంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్‌ సమీపంలోని 163 జాతీయ రహదారిపై మంగళవారం కంటైనర్‌ లారీ కారును ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న రైతు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. వెంకటాపురం(కె) చెందిన పోలిన శ్రీనివాసరావు (58) తన కుమార్తె పోలిన శృతిని హైదరాబాద్‌లోని కాలేజీకి పంపించేందుకు తన కారులో ఇంటి నుంచి బయలుదేరారు. ఇదే క్రమంలో 163 జాతీయ రహదారిపై ఇసార్‌ పెట్రోల్‌ బంక్‌ సమీపంలో ఎదురుగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్తె శృతికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో ములుగు వెళ్తున్న వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ ప్రమాద స్థలానికి చేరుకుని గాయపడిన శృతిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తన వాహనంలో తీసుకువచ్చి చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఇందయ్య పరిశీలించి కారులో ఇరుక్కుపోయి శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకు తీసి ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె హైదరాబాద్‌లో బీటెక్‌ చదువుతోంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

నకిలీ వేబిల్లులపై కొనసాగుతున్న దర్యాప్తు

ఏటూరునాగారం: ఇసుక క్వారీల నకిలీ వే బిల్లుల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలంగాణ స్టేట్‌ మినరల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (టీఎస్‌ఎండీసీ) జీఎం పాండురంగారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని టీఎస్‌ఎండీసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇసుక క్వారీల నుంచి దొంగ వే బిల్లులకు సంబంధించి దర్యాప్తు జరుగుతుందని, ఇసుక డంపులు , దొంగ బిల్లులు క్రియేట్‌ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వానికి, శాఖకు చెడ్డ పేరు తీసుకువచ్చిన వారిని ఎట్టి పరిస్థితిలో వదిలిపెట్టేది లేదన్నారు. వాజేడు, వెంకటాపురం(కె) ఇసుక క్వారీలను పరిశీలించామన్నారు. మరో ఐదు క్వారీలు వెంకటాపురం, మంగపేట మండలాల్లో మంజూరు అవుతున్నట్లు జీఎం పాండురంగారావు తెలిపారు. ఈ సమావేశంలో పీఏ ఎల్లయ్య, ఏపీఓ శంకరయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జీఎం పాండురంగారావు

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్‌

జనగామ: ఏపీ రాష్ట్రం నుంచి తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి.సీతారం తెలిపారు. జనగామ డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరిగొప్పులకు చెందిన మటన్‌ వ్యాపారి ఎండీ జలీల్‌, కొడకండ్ల మండలం రెగ్యులతండాకు చెందిన ప్రైవేట్‌ డ్రైవర్‌ కేలోతు నవీన్‌, అదే తండాకు చెంది కేలోతు చందూలాల్‌ ముగ్గురు వ్యక్తులు గంజాయికి అలవాటు పడి, చిన్న స్థాయి బిజినెస్‌గా మార్చుకున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేస్తూ.. రహస్యంగా ఇక్కడకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను టార్గెట్‌ చేస్తూ... గంజాయి తాగడం అలవాటు చేస్తున్నారు. ఇందులో గంజాయికి అలవాటు పడిన కొంత మందిని అమ్మకం కోసం వినియోగించుకుంటున్నారు. ముగ్గురు స్మగ్లర్లు తమ గంజాయి వ్యాపార సామ్రాజ్యాన్ని రోజురోజుకూ విస్తరించుకుంటూ పోతున్నారు. వీరి ఉచ్చులో పడి వందల సంఖ్యలో గంజాయికి అలవాటు పడి బానిసలుగా మారినట్లు స్పష్టం చేశారు. జిల్లాలోని పలు మండలాలకు సైతం గంజాయిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి అమ్మకాలు చేస్తున్నారనే పక్కా సమాచారంతో మంగళవారం నర్మెట ఎస్సై ఎస్‌కె జానీపాష, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రం శివారు పెట్రోల్‌ బంకు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో.. వెంటనే పట్టుకుని విచారించగా వారివద్ద రూ.85 వేల విలువ చేసే 4.250 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకుని.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇందులోని లింకులపై ప్రాథమిక విచారణలో గుర్తించడం జరిగిందని, త్వరలోనే ఒక్కొక్కటిగా బయటకు తీస్తామన్నారు. గంజాయి సేవిస్తున్న 42 మంది పిల్లల తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్‌ ఇస్తామని, అప్పటికి పద్ధతి మార్చుకోకపోతే కఠిన శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, జనగామ, నర్మెట సీఐలు ఎలబోయిన శ్రీనివాస్‌, నాగబాబు, ఎస్సైలు నవీన్‌, జీనత్‌, సృజన్‌, కానిస్టేబుల్‌ రామన్న, మహేష్‌, కర్ణాకర్‌ తదితరులు ఉన్నారు.

'ఏకశిల'లో ఉగాది వేడుకలు




ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారులోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం సాంప్రదాయ వేషధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుని పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి విశిష్టతను వివరించారు. అనంతరం ఏకశిల విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ హిందువుల తొలి పండుగ ఉగాది అన్నారు. ఈ శోభకృత్‌ నామ సంవత్సరంలో తెలుగు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏకశిల పాఠశాల డైరెక్టర్‌ గౌరు సువిజారెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ జి.ఫణి మోహన్‌రావు, ఏఓ రాంప్రసాద్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

రామన్నపేట: భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భర్త భార్యను కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడగా సదరు వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఇంతేజార్‌గంజ్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి నాగమణి (30) సుధాకర్‌ అనే వ్యక్తితో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం వరంగల్‌ లక్ష్మీపురంలో నివాసముంటున్నారు. గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య గొడవ జరుగుతుండటంతో ఎనిమిది నెలల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఈ నెల 18న ఉదయం భార్యను చంపాలనే ఉద్దేశ్యంతో వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో నాగమణిని పొడిచాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మహబూబాబాద్‌ రూరల్‌: మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని నారాయణనగర్‌ కాలనీలో నివాసం ఉండే సుతారి కూలి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్‌ ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణనగర్‌కాలనీకి చెందిన సుతారి కూలి దుస్స వీరన్న (32) ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్‌ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-26841]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్‌ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-26848]

■వరంగల్‌, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్‌ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్‌: 7660008666, 8309035091. [WA-26847]

■హన్మకొండ నయీంనగర్‌లో H.No: 2-2-189/1 120 చ॥గ॥లలో గల House అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్‌. సంప్ర॥ సెల్‌: 9030382583. [W-775799]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్‌ అపార్ట్‌మెంటులో 2&3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-26840]

LOANS / PLOTS

■GWMC పరిధిలో 4 వేలకు గజం గల ఓపెన్‌ ప్లాట్స్‌ లభించును మరియు అన్నిరకాల లోన్లు కొరకు వెంటనే సంప్ర॥ 9949304722, 9866634088. [W-785459]

PLOT FOR SALE

■మామునూర్‌ సెంటర్లో 347 చదరపు గజాల నార్త్‌ ఈస్ట్‌ కార్నర్‌ ప్లాటుకై. సంప్రదించవల్సిన సెల్‌ నెం: 9032111600, [W-775798]

■GWMC-KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్‌ మేన్‌గేట్‌కి ఎదురుగా రోడ్‌ ఫేసింగ్‌ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-775797]

SERVICES

■హౌజ్‌, ఫ్లాట్‌, ఓపెన్‌ ప్లాట్‌, ల్యాండ్‌, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్‌ చేసుకొని వారంలో అమౌంట్‌ ఇప్పించబడును. సెల్‌: 9666142226. [W-785458]

LOANS

■ హౌసింగ్‌, బిజినెస్‌, పర్సనల్‌, మార్టిగేజ్‌ & ఉద్యోగస్తులందరికి పర్సనల్‌ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్‌-WGL. 9618767116 [W-785454]

WATER PROOPING

■మీరు వాటర్‌లీకేజి సమస్యతో బాధపడుతున్నారా? అయితే బాత్‌రూమ్స్‌ స్లాబ్స్‌, వాటర్‌ ట్యాంక్స్‌, ఏ ఇతర లీకేజి ఐనాసరే అధునాతమైన కెమికల్స్‌తో గ్యారంటీతో చేయబడును. ✆ 99 66 77 37 37 [B-786697]

BUSINESS OFFER

■ Capro కంపెనీ ప్రైవైడ్‌ అన్ని రకములైన బిజినెస్‌ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్‌, ✆ 9319814720. [T-1196145]

WANTED

■ వరంగల్‌, హన్మకొండ, కాజీపేటలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్‌ కావలెను. సాలరీ: 12000/- టైమింగ్స్‌: ఉ॥ 10 గం నుండి సా॥ 5గం॥ల వరకు. సంప్ర॥ 0870-3569177. [W-775796]

■ ప్రముఖ కంపెనీలో లక్కీ కూపన్స్‌ బుక్‌ చేయుటకు వాక్చాతుర్యం కలిగిన యువతీ యువకులు కావలెను. వేతనము: రూ॥ 12000/-. సంప్ర॥ 9666581883, 9704128229. [WA-6923]

■ Wanted Sales Executive / Collection Executive for Delicious Farms Chicken Outlets in Warangal Required Exp. in same domain. Sal + Bonus. Age: 25-35yrs. Timings: 8am-7pm. 8106112401 [W-785456]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 8500/- సంపాదించుకోండి. వాట్సాప్‌ చేయండి. 9573633520, 9059633520 [M-1190652]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్‌. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-7095231]

■ హరేకృష్ణ హోంకేర్‌, హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:16K, ఏజెంట్‌ కమీషన్‌ 6K. ఫోన్‌: 9640258889. [H-786849]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్‌	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్‌	9010144453
జయశంకర్‌ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము